మీర్‌పేట్‌లో ఇంటి పన్నుల సవరణ జరిగేనా?



మీర్‌పేట్ కార్యాలయం



మంత్రి శ్రీధర్‌బాబుకు ఇంటి పన్నుల అంశంపై ఇటీవల వినతిపత్రం అందజేసిన టీపీసీసీ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రెడ్డి, ఫెడరేషన్ ప్రతినిధులు(ఫైల్)



ఇంటి పన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు నిర్వహించిన బీజేపీ నేతలు(ఫైల్)

- నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ
- సమస్యను భుజాన వేసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నేత గోపాల్‌రెడ్డి
- మంత్రికి సమస్యను వివరించిన కేఎల్లార్
- ఇదే సమస్యపై మూడు రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టిన బీజేపీ

సరూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నుల వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సమస్యపై మీర్‌పేట్ కాలనీ అసోసియేషన్‌ల ఫెడరేషన్ చేపట్టిన ఉద్యమం సత్ఫలితాలు ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. 'నెల రోజుల్లోగా జీహెచ్‌ఎంసీ తరహాలో మీర్‌పేట్‌లో ఇంటి పన్నుల మదింపు జరిగేలా చూస్తాను' అంటూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఇచ్చిన భరోసా స్థానికులకు కొండంత బలాన్నిచ్చినట్టయింది. జీహెచ్‌ఎంసీలో, మీర్‌పేట్‌కు ఆనుకుని ఉన్న బడంగ్‌పేట్‌లో ఇంటి అద్దె విలువ(రెంటల్ వాల్యూ) ఆధారంగా పన్నులు విధిస్తుండగా.. మీర్‌పేట్‌లో మాత్రం అందుకు భిన్నంగా ప్రాపర్టీ క్యాపిటల్ వాల్యూ ఆధారంగా పన్ను విధిస్తున్నారు. దాంతో 200 చదరపు గజాల ప్లాటులో గల ఇంటికి జీహెచ్‌ఎంసీలో, బడంగ్‌పేట్‌లో దాదాపు రూ.8వేలు నుంచి రూ.10వేలు పన్ను వస్తుండగా.. మీర్‌పేట్‌లో క్యాపిటల్ వాల్యూ ఆధారంగా పన్ను విధిస్తుండడంతో అది కాస్తా దాదాపు రూ.15వేలకు పైగా వస్తోంది. ఇది మీర్‌పేట్ నివాసితులకు మోయలేని భారంగా మారింది.

శ్రీధర్‌బాబు హామీ అమలయ్యేనా..?

ఈ అంశంపై ప్రధాన రాజకీయ పార్టీలు క్రెడిట్ గేమ్ ఆడుతుండగా, దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో కాలనీ అసోసియేషన్‌ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్ని పార్టీలు ఏకతాటిపైకి చేరుకున్నాయి. బీజేపీ నాయకులు మాత్రం ముఖం చాటేశారు. గత మార్చి రెండో వారంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయగా, మీటింగ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పరిష్కరించలేని ఈ సమస్యను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంతో పరిష్కరింపజేస్తానని ప్రకటించారు. ఈ క్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, ప్రేమ్‌చంద్రారెడ్డి తదితరులతో కలిసి మార్చిలో కందుకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ ఈ సమస్యను మంత్రికి విపులంగా వివరించారు.

అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నెల రోజుల్లోగా మీర్‌పేట్ ఇంటి పన్నుల సమస్యను పరిష్కరింపజేస్తానని, ఇక్కడ సైతం జీహెచ్‌ఎంసీ తరహాలోనే పన్నుల మదింపు ఉండేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. అయితే గత ప్రభుత్వ హయాంలోనూ అప్పటి మంత్రి సబితారెడ్డి స్వయానా కౌన్సిల్ సమావేశంలోనే పన్నులను తగ్గిస్తామని బహిరంగ ప్రకటన చేసినప్పటికీ అది అమలుకు నోచుకోలేదని, తాజాగా శ్రీధర్‌బాబు హామీ మాత్రం అమలవుతుందన్న గ్యారెంటీ ఏంటని స్థానికులు చర్చించుకుంటున్నారు. పాలకులు తమ ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న దాఖలాలు లేవని ఇక్కడి ఇంటి పన్నుల బాధితులు ఆరోపిస్తున్నారు. ఫెడరేషన్ తరఫున ఈ సమస్యను భుజాన వేసుకున్న పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు గోపాల్‌రెడ్డి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ మీర్‌పేట్‌లోని ఇంటి పన్నుల సమస్యను దగ్గరుండి మరీ పరిష్కరింపజేయిస్తానని ఘంటాపథంగా చెబుతున్నారు.

రిలే నిరాహార దీక్షలతో ప్రజల్లోకి బీజేపీ..


కాంగ్రెస్ నేతలు ఓ పక్క తమ దారిలో తాము పన్నుల భారం తగ్గింపుపై దృష్టి పెట్టగా.. మరోపక్క బీజేపీ నేతలు ఇదే సమస్యపై మూడు రోజుల పాటు మునిసిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టి ప్రజలకు దగ్గరవడానికి ప్రయత్నించారు. పలువురు రాష్ట్రస్థాయి నాయకులను దీక్షలకు ఆహ్వానించి వారితో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రసంగాలు చేయించారు. పన్నులు తగ్గించేదాకా ఉద్యమం కొనసాగిస్తామని ఆ పార్టీ నేతలు స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, తాజాగా ఆ పార్టీ నేతలెవరూ ఈ అంశంపై మాట్లాడకపోవడం ఇక్కడ గమనార్హం!

సబితారెడ్డి చొరవతో పన్నులపై నివేదిక రెడీ: బీఆర్‌ఎస్

మాజీ మంత్రి సబితారెడ్డి ఇంటి పన్నుల అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఆమె సీడీఎంఏకు దీనిపై లేఖ రాయడంతో అక్కడి నుంచి మీర్‌పేట్ కమిషనర్‌ను నివేదిక కోరుతూ లెటర్ వచ్చిందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే మునిసిపల్ అధికారులు దీనిపై ఓ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారికి పంపించారని, త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆమోదయోగ్యమైన ప్రకటన వచ్చే అవకాశమున్నదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. సబితారెడ్డి పట్టుదల వల్లనే సమస్య పరిష్కారానికి మార్గం సుగమమయిందని వారంటున్నారు. మొత్తంమీద ఒకే సమస్యపై అన్ని పార్టీలు తమదైన శైలిలో రాజకీయ క్రీడ మొదలుపెట్టగా.. ఈ సమస్య నిజంగా పరిష్కారానికి నోచుకుంటుందా.. లేక గత ప్రభుత్వం హయాంలో వలెనే మరో పదేళ్ల పాటు ఇలాగే నానుతూ ప్రజలకు భారంగా కొనసాగుతుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ నిజంగా పన్నుల భారం తగ్గితే.. ఆ క్రెడిట్ ఎవరి ఖాతాలోకి చేరుతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న..!

కొసమెరుపు:

ఇంటి పన్నుల వ్యవహారం ఒక్క మీర్‌పేట్‌కే పరిమితం కాదని, నగరం చుట్టుపక్కల ఉన్న పలు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ ఈ సమస్య ఉన్నదని, ఈ దృష్ట్యా దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటే అది అన్ని ప్రాంతాలకు వర్తిస్తుందని అధికారులు పేర్కొంటుండడం ఇక్కడ కొసమెరుపు..! దాంతో ఈ సమస్య ఇప్పుడప్పుడే పరిష్కారమయ్యే సూచనలు ఏమాత్రం కనిపించడంలేదన్నది అక్షర సత్యం..!!



సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టవచ్చు

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సూర్యానగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నేరస్థులను త్వరగా పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డితో కలిసి సూర్యానగర్‌కాలనీలో రూ.3లక్షల సొంత నిధులతో కాలనీ వాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు. దశలవారీగా అన్ని కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పా టు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి చిన్న పనికి ప్రభుత్వం మీద ఆధారపడి ఉండకుండా సొంత నిధులు సమకూర్చుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమని సూర్యానగర్ కాలనీవాసులను ఎమ్మెల్యే అభినందించా రు. సీసీ కెమెరాల గురించి పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. సీసీ కెమెరాల వల్ల దొంగతనాలను అరికట్టవచ్చునని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని తెలిపారు. నేరం జరిగిన గంటలోపే పోలీసులు నిందితులను పట్టుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లేష్ ముదిరాజ్, భాస్కర్ సాగర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేద్దాం

మన్సూరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీ ఆదివారం నిర్వహించే భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) పార్టీ రజతోత్సవ మహాసభను నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో బుధవారం నియోజకవర్గ పార్టీ ముఖ్యనేతలతో సమీక్ష నిర్వహించిన ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్‌కుమార్, జీవీ సాగర్‌రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా



పార్కులో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సత్యసాగర్ కాలనీలోని పార్కులో పలు సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ని కోరారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పార్కులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఈ రాజ్‌కుమార్, హార్టికల్చర్ మేనేజర్ మేధా పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల ఎంపీవోకు బుధవారం సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలతో పాటు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. అంజయ్య, బాలయ్య, లక్ష్మయ్య, జ్యోతి, కవిత, భిక్షపతి, సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ కాంప్లెక్స్ సమీపంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏఈ విగ్నేశ్వరీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు సాయికిరణ్‌గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం తరలింపు

ఓల్డ్‌మలక్‌పేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ ఎక్స్‌రోడ్‌లో కొనసాగుతు న్న మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ కార్యాలయాన్ని తరలిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ సరిపోకపోవడం వల్ల సర్కిల్ కార్యాలయాన్ని మలక్‌పేటలోని ముంతాజ్ కాలేజీ వెనుకాల ఉన్న ప్రభుత్వ బిల్డింగ్ బీ-బ్లాక్ క్వార్టర్స్‌లోకి మార్చారు. నాలుగేళ్లుగా నల్లగొండ ఎక్స్‌రోడ్‌లోని వికలాంగుల జాతీయ పార్క్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సర్కిల్-6 కార్యాలయం కొనసాగుతుంది. రెండు రోజులుగా కార్యాలయం సామగ్రి కొత్త బిల్డింగ్‌లోకి తరలిస్తున్నారు. సర్కిల్ కార్యాలయాన్ని బీ-బ్లాక్‌లోకి మార్చిన విషయాన్ని ప్రజలు గమనించాలని కార్యాలయ పనులు ఇక్కడినుంచే కొనసాగుతాయని డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు.

ఆయుర్వేద చారిత్రక వస్తువుల ప్రదర్శన



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ గోలి పెంచల ప్రసాద్, డాక్టర్ సాకేత్ రామ్ తదితరులు

సైదాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్‌ఐఐఎంహెచ్)లో టాంజిబుల్, ఇంటాంజిబుల్ ద్వారా ఆయుర్వేద చారిత్రక వస్తువుల ప్రదర్శన అనే అంశంపై వర్క్‌షాప్ కొనసాగుతుంది. ఈనెల 7న ప్రారంభమైన వర్క్‌షాప్ శుక్రవారం వరకు ఐదు రోజుల పాటు జరుగుతుంది. ఎన్‌ఐఐఎంహెచ్ సంస్థ ఇప్పటి వరకు శాసనాలు, శిల్పాలు, చారిత్రక ప్రదేశాల ద్వారా సేకరించిన 948 వైద్య సంబంధిత చారిత్రక వస్తువులను ప్రదర్శించారు. బుధవారం టీటీడీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాయకులు, మహారాష్ట్ర జల్గావ్‌లోని హెరిటేజ్ ఫౌండేషన్ డైరెక్టర్ భుజంగ బాబాడ ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్ సమావేశానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ గోలి పెంచల ప్రసాద్, రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ సాకేత్ రామ్, సంతోష్ ఎస్ మానే, ఆఫీసర్లు మురళీమనోహర్, రాజేశ్వరీ పాల్గొన్నారు.



రాచకొండ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ బుసిరెడ్డి రవీంద్రారెడ్డి కుమారుడు శంతనుకుమార్ గ్రూప్ 1 పరీక్షలో 30వ ర్యాంకు సాధించిన సందర్భంగా అభినందించిన సీపీ సుధీర్‌బాబు

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

అందరికీ గుండుగుత్తగా అరవై వేలేనా ?

- వైద్య ఖర్చులకు అవి సరిపోతాయా?
- సీఎంఆర్‌ఎఫ్ సాయంపై ప్రభుత్వంపై మండిపడ్డ సబితారెడ్డి



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వైద్యం ఖరీదుగా మారిన ప్రస్తుత తరుణంలో రూ.లక్షల్లో ఖర్చుపెట్టి వైద్యం చేయించుకున్న పేద, మధ్య తరగతివారికి ప్రభుత్వం సీఎం సహాయనిధి పథకం ద్వారా అందజేస్తున్న సాయం ఏ మూలకూ సరిపోవడంలేదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 'అందరికీ గుండు గుత్తగా రూ.60వేలు మంజూరు చేస్తున్నారు.. ఏ ప్రాతిపదికన ఇలా ఒకే మొత్తం ఇస్తున్నారు.. చిన్న చిన్న రుగ్మతలకు వైద్యం చేయించుకున్న వారికి ఆ మొత్తం ఓకే.. మరి రూ.లక్షల్లో ఖర్చు చేసిన వారికి సైతం అంతే మొత్తం మంజూరు చేయడం ఏమిటీ?'.. అని ఆమె ప్రభుత్వంపై మండిపడ్డారు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మునిసిపాలిటీకి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె వారికి అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఆస్పత్రుల్లో అయిన వాస్తవ ఖర్చును ప్రామాణికంగా తీసుకుని అందులో దాదాపు 60నుంచి 70శాతం మొత్తాన్ని మంజూరు చేసేవారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వైద్య ఖర్చులను పక్కనబెట్టి, అందరినీ ఒకే గాటన కట్టి రూ.60వేల చొప్పున మంజూరు చేస్తూ చేతులు దులుపుకుంటున్నదని ఆమె ఆరోపించారు. వేళ్ల మీద లెక్కబెట్టేంత మందికి మాత్రమే కాస్త ఎక్కువ మొత్తం మంజూరు చేస్తున్నారని, అది కూడా ప్రభుత్వంలోని కొందరి రికమెండేషన్‌లోనే జరుగుతున్నదని ఆమె అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, వారికి ఆస్పత్రుల్లో అయిన ఖర్చును ప్రామాణికంగా తీసుకుని న్యాయబద్ధంగా సీఎం సహాయనిధి మంజూరు చేయాలని ఆమె ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్, మీర్‌పేట్ శాఖల అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, నాయకులు భూపాల్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, జి.రఘునందన్‌చారి, కళ్లెం ఎల్లారెడ్డి, గిరీశ్, వెంకట్‌రెడ్డి, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఫల్యంతోనే నగరంలో తాగునీటి సమస్య తీవ్రం

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు దాహార్తితో అలమటిస్తుంటే ప్రభుత్వానికి చలనం కూడా లేకుండా పోయిందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లోని జూనియర్ ఎన్టీఆర్‌నగర్‌లో తాగునీటి సమస్య తలెత్తిందని తెలియడంతో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆమె ఆ ప్రాంతంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డి వైఫల్యంతోనే నగరంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్నదన్నారు. 10 సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు నిరంతరాయంగా అందిందన్నారు. కానీ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 3 నెలలుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. జంటనగరాలలో ఏ వీధిలో చూసిన తాగునీటి సమస్యతో పాటు ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయన్నారు. ప్రభుత్వం కనీసంగా తాగునీటి వంటి ప్రాథమిక అవసరాలను కూడా తీర్చలేని పరిస్థితిలో ఉందన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం కళ్లు తెరిచి తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, సాజిద్, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆటోలో మరచిన ల్యాప్‌టాప్‌లు అప్పగింత

- ఆటో డ్రైవర్ నిజాయితీకి ప్రశంస పురస్కారం



ఆటో డ్రైవర్ రాంచందర్‌కు నగదు పురస్కారం అందజేస్తున్న చాదర్‌ఘాట్ క్రైం ఇన్‌స్పెక్టర్ భూపాల్, ఎస్‌ఐలు భరత్, పర్వేజ్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ లాప్‌టాప్‌లు మరచిపోవడంతో వాటిని చాదర్‌ఘాట్ పోలీసుల ద్వారా తిరిగి అప్పగించిన ఆటో డ్రైవర్‌ను గుడ్ సమారిటన్ పురస్కారంతో సత్కరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చైతన్యపురి సాయి రాఘవేంద్ర డెసిడెన్సీ నివాసి జి.శ్రీనివాసరావు ఐటీ ఉద్యోగి ఈనెల 3న ఐటీ విధులను పూర్తి చేసుకుని సీతారాంబాగ్ నుంచి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యాడు. తన వెంట ఉన్న రెండు ల్యాప్‌టాప్‌లను మరచిపోయి ఆటో నుంచి దిగి ఇంటికి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన ఐటీ ఉద్యోగి చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో తన రెండు లాప్‌టాప్‌లు ఆటోలో మరచిపోయినట్లుగా ఫిర్యాదు చేశాడు. అదేరోజున ఆటో డ్రైవర్ ఉప్పల్ నివాసి పడిగె మచనే రాంచందర్ తన ఆటోలో మరచిపోయిన రెండు ల్యాప్‌టాప్‌లను మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛందంగా వెళ్లి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సమాచారాన్ని గుర్తించిన మహంకాళి పోలీసులు ఆటో డ్రైవర్ నిజాయితీగా తమకు రెండు ల్యాప్‌టాప్‌లను అప్పగించిన విషయాన్ని వివరించారు. మహంకాళి పోలీసుల సమన్వయంతో చాదర్‌ఘాట్ పోలీసులు రెండు ల్యాప్‌టాప్‌లను మహంకాళి పోలీస్‌స్టేషన్ నుంచి తెప్పించుకున్నారు. ఆటో డ్రైవర్ నిజాయితీని బుధవారం ప్రశంసిస్తూ ఫిర్యాదు దారుడైన ఐటీ ఉద్యోగి జి.శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీని ప్రశంసిస్తూ రూ.1000ల నగదుతో గుడ్ సమారిటన్ పురస్కారంతో సత్కరించినట్లు చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు తెలిపారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ క్రైమ్, యాంటీ నార్కోటిక్స్, డ్రగ్స్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ కృష్ణ, కానిస్టేబుల్ రాజ్‌కుమార్, రాజు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రాంచంద్రారెడ్డి, ఉమామహేశ్వర్‌రావు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌వో శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో బెంగళూరు ప్రయాణికులకు రాయితీ

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులకు రాయితీ కల్పించినట్లు హైదరాబాద్-2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని రకాల నాన్ ఏసీ, ఏసీ బస్సులకు 10శాతం రాయితీ కల్పించినట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

మన్సూరాబాద్ : తన ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోల్‌లోని సాయినగర్‌కాలనీ రోడ్ నెంబర్.4లో తన ఇద్దరూ కూతుళ్లు ఆయేషా (19), అఫ్ష(14), కుమారుడు బిలాల్(17)లతో కలిసి ముర్సలీనా(50) నివాసం ఉంటుంది. కాగా ముర్సలీనాకు తన భర్త నదీంతో ఆరు నెలల క్రితం విడాకులయ్యాయి. కాగా తన అక్క యోగక్షేమాలు అడిగేందుకు ముర్సలీనా సోదరుడు మహమ్మద్ ముస్తఫా ఆమెకు ఈనెల 7న ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో 8న ఆమె అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇంటి యజమానిని విచారించగా ఈనెల 5న బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తన పిల్లలతో కలిసి వెళ్లినట్లుగా తెలిపాడు. దీంతో ముస్తఫా తెలిసిన బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల వారిని విచారించినా ఆచూకీ లభ్యమవ్వలేదు. ఈ మేరకు బుధవారం నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఉరేసుకొని భార్య.. భవనంపై నుంచి దూకి భర్త!

24 గంటల వ్యవధిలో దంపతుల ఆత్మహత్య

హయత్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆ దంపతుల క్షణికావేశం, వారి 11నెలల బిడ్డను అనాథను చేసింది. కుటుంబ తగాదాలతో మనస్తాపం చెందిన ఆ ఇల్లాలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంటే.. తీవ్ర షాక్‌కు గురైన ఆ భర్త, భవనం ఏడో అంతస్తు నుంచి దూకి ప్రాణాలు విడిచాడు. హయత్‌నగర్ పరిధిలోని జరిగిందీ విషాదం. హయత్‌నగర్ డివిజన్ ముదిరాజ్‌కాలనీకి చెందిన సంపంగి నగేశ్ (25) జీహెచ్‌ఎంసీలో కార్మికుడు. రెండేళ్ల క్రితం అదే కాలనీలో నివాసం ఉండే శిరీష(22)ను పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు 11నెలల బాబు ఉన్నాడు. కొన్నాళ్లుగా నగేశ్, శిరీష మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 11:30కు శిరీష ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. నగేశ్ వేధింపులను తాళలేకే శిరీష ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగేశ్‌ను అదేరోజు పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి.. సాయంత్రం సొంతపూచీకత్తుపై విడిచిపెట్టారు. కాగా నగేశ్, బుధవారం తెల్లవారుజామున ముదిరాజ్‌కాలనీ నుంచి నడుచుకుంటూ వచ్చి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న రిలయన్స్ డిజిటల్ మార్ట్ భవనంపైకి ఎక్కి అక్కడి నుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. నగేశ్ మృతిపై అతడి బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి నగేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని తేల్చారు. తెల్లవారుజామున ఐదుగంటలకు నగేశ్.. రిలయన్స్ భవనం పైకి ఎక్కుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఐ



ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రవీంద్రాచారి, శేఖర్‌రెడ్డి, సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ వంట గ్యాస్ ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్బీనగర్ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డిలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ప్లకార్డుల ప్రదర్శనలతో నిరసన వ్యక్తం చేసి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసనలో సీపీఐ సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాల కార్యదర్శులు భారతరాజు నర్సింహ, శేషరాజుపల్లి శ్రీదేవి, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, రాములుగౌడ్, శోభన్, అరుణ్‌కుమార్‌గౌడ్, సుజాత, సరిత, రమావత్ సక్రూనాయక్, మద్దిలేటి, శివజ్యోతి, సౌజన్య, యమునా, చెంది వెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కుంట్లూర్ ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ ఎక్స్‌రోడ్డు వద్ద సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. కేంద్రం గ్యాస్ ధరలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందన్నారు. బేషరతుగా పెంచిన ధరలను తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నర్సింహ, ప్రసాద్, నిరంజన్, యాదగిరి, రాములు, గోపీ, వినోద్, రాజు, రమేష్, నవనీత, చందన, సుజాత పాల్గొన్నారు.

హయత్‌నగర్ : పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ సీపీఎం ఆధ్వర్యంలో వంట గ్యాస్ సిలిండర్లను చేత పట్టుకుని నాగార్జునసాగర్ రహదారిపైన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా దేశంలో మాత్రం గ్యాస్ ధరలు తగ్గడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, భాస్కర్, మాల్యాద్రి, యాదగిరి, రాములు, యాదయ్య, హనుమంతరెడ్డి, బాల్‌రాజ్, బీరప్ప, మధుకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, హరీష్ పాల్గొన్నారు.